## క్లుప్తంగా

### ప్రగతి స్కాలర్‌షిప్‌కు ఎంపికైన డిప్లమో విద్యార్థులు



నిహారిక రేష్మా

కమలాపురం : స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈసీఈ గ్రూప్ చదువుతున్న విద్యార్థినులు ఎ.నిహారిక, ఎస్.రేష్మా ఇద్దరూ ప్రగతి స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2024-25 విద్యా సంవత్సరంలో స్పాట్ అడ్మిషన్ ద్వారా ప్రవేశం పొందిన వారు ఏఐసీటీఈ-ప్రగతి స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారని ఆయన తెలిపారు. ఈ స్కాలర్ షిప్ ద్వారా వారు డిప్లమో కోర్సు మొత్తం గడువులో ప్రతి సంవత్సరం రూ.50 వేలు ఆర్థిక సహాయం అందుకుంటారన్నారు. ఈ ఘనత తమ కళాశాలలో మొట్ట మొదటి సారి నమోదవడం గర్వకారణం అన్నారు. టీమ్ లీడర్ అఖిల్, అహ్మద్ మార్గ నిర్దేశనంలో ఈసీఈ లెక్చరర్ దిలీప్‌కుమార్, ఈఈ లెక్చరర్ ఎం.మాధురితో కూడిన స్కాలర్‌షిప్ టీం సమష్టిగా కృషి చేసిందన్నారు. స్కాలర్ షిప్ పొందిన విద్యార్థినులతో పాటు అందుకు కృషి చేసిన అధ్యాపక బృందాన్ని ఆయన అభినందించారు.

### జ్వరం వచ్చిన ప్రతి ఒక్కరికి రక్త పరీక్షలు నిర్వహించాలి



అవగాహన కల్పిస్తున్న పీహెచ్‌సీ డాక్టర్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి

తొండూరు : జ్వరం వచ్చిన ప్రతి ఒక్కరికి రక్త పరీక్షలు నిర్వహించాలని పీహెచ్‌సీ డాక్టర్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం సంతకొవ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా డే సందర్భంగా పీహెచ్‌సీ డాక్టర్ ఆధ్వర్యంలో ఫ్రై డే - డ్రై డే ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. మలేరియా రక్తపూతల టార్గెట్‌ను ప్రతి ఆరోగ్య కార్యకర్త పూర్తి చేయాలని, ప్రతి బుధ, శనివారాలు రక్త పూతలను ల్యాబ్‌కు ఇవ్వాలన్నారు. అలాగే గ్రామాల్లో దోమకాటువల్ల వచ్చే వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్ధయ్య మాట్లాడుతూ సచివాలయ పరిధిలోని ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, సచివాలయం సిబ్బంది ఇంటింటా లార్వా సర్వే నిర్వహించాలన్నారు. ప్రతి ఒక్కరు దోమ తెరలు వాడాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి సుబ్రమణ్యం, సూపర్‌వైజర్ రాధ, తదితరులు పాల్గొన్నారు.

### అంగన్‌వాడీలకు మెరుగైన ఫోన్లు అందించాలి



సెల్‌ఫోన్లు పనిచేయలేదంటూ నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

వేంపల్లి : ప్రస్తుతం తమ వద్ద ఉన్న మొబైల్ ఫోన్లకు నెట్‌వర్క్ సక్రమంగా పని చేయడంలేదని, వెంటనే నెట్‌వర్క్ సక్రమంగా ఉన్న ఫోన్లను అందించాలని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు సరస్వతీ, ప్రభావతి, శైలజ, శాంత, లక్ష్మిదేవిలు తెలిపారు. అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మంగళవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలోని సీడీపీఓ టేబుల్‌పైన అంగన్‌వాడీ వర్కర్లందరూ తమ ఫోన్లను పెట్టారు. అలాగే ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు పనిచేయని సెల్‌ఫోన్లు మాకు వద్దంటూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం ఫోన్లకు నెట్‌వర్క్ సక్రమంగా అందకపోవడంతో తీవ్రమైన అంతరాయం ఏర్పడుతోందన్నారు. ముఖ్యంగా యాప్‌లో చేయాల్సిన పనులు చేయలేకపోతున్నామని, గతంలో కూడా అనేకసార్లు ఈ సమస్యను ప్రభుత్వాలు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. తమ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తక్షణమే అంగన్‌వాడీ వర్కర్లకు మెరుగైన మొబైల్ ఫోన్లను అందించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

### సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్‌కుమార్

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక ఐజీ కార్ల్ అకాడమిలో మంగళవారం రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి సమాచార హకు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్ కుమార్ హాజరై సమాచార హక్కు చట్టం ప్రాముఖ్యత, ఈ చట్టంవల్ల కలిగే ప్రయోజనాలు, తదితర వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మెంటార్స్, రిటైర్డు సైంటిస్టులు పాల్గొన్నారు.

# ముమ్మరంగా జెడ్పీటీసీ ఎన్నిక ప్రచారం

పులివెందుల మండలం జెడ్పీటీసీ ఉప ఎన్నికలో వైఎస్సార్‌సీపీ ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. ఆ పార్టీ నాయకులకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. మండల పరిధిలోని ఆర్.తుమ్మలపల్లె, రాయలాపురం, రచ్చుమర్రిపల్లె గ్రామాల్లో మంగళవారం ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. వారికి ప్రజలు ఘన స్వాగతం పలికి అభిమానం చాటుకున్నారు.

– పులివెందుల



పులివెందుల మండలం తుమ్మలపల్లెలో ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ నేతలు



ఎన్నికల ప్రచారంలో అభ్యర్థి తుమ్మల హేమంత్ రెడ్డి కోసం ప్రచారంలో పాల్గొన్న జిల్లా మహిళా అధ్యక్షురాలు టీపీ సుబ్బమ్మ, మహిళా నేతలు



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, సతీష్‌రెడ్డి పార్టీ నేతలు



ఎన్నికల ప్రచారంలో జెడ్పీటీసీ అభ్యర్థి తుమ్మల హేమంత్‌రెడ్డి కోసం ప్రచారం లో పాల్గొన్న జిల్లా మైనారిటీ నేతలు

### సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు

వేముల : చీనీ సాగులో సేంద్రియ ఎరువులను వాడటం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని ఏఓ ఓబులేసు రైతులకు సూచించారు. మండలంలోని పెద్దజూటూరు, నల్లచెరువుపల్లె గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చీనీలో ప్రధానంగా సూక్ష్మదాతు లోపాల సమస్య ఎక్కువగా ఉందన్నారు. చీనీ సాగులో ఇనుపదాతు నివారణకు పెరస్ సల్ఫేట్ 20 గ్రాములు లీటరు నీటిలో కలిపి ఏడు రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయాలన్నారు. మొక్కలకు కూవినింగ్ అత్యంత ఆవశ్యతకమైందని, వ్యాధి సోకిన కొమ్మలు, ఒంటి కొమ్మలు తొలగించి సరైన మోతాదులో సేంద్రియ ఎరువులను వాడాలన్నారు. ఈ ఎరువులను వాడటంవల్ల మంచి పూత, కాపు వస్తుందని, పూత శాతం పెరగడానికి పొటాష్ నైట్రేట్ 10 గ్రాముల చొప్పున పిచికారి చేయాలన్నారు. భూమిలో పచ్చి రొట్టలను కలియదున్నుకుని సారవంతం పెంచుకోవడం రైతులకు ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో ఏఈఓ సురేష్, వీహెచ్‌ఏ మల్లిక, రైతులు పాల్గొన్నారు.

# ఖాతాదారుల శ్రేయస్సే బ్యాంక్ లక్ష్యం



మాట్లాడుతున్న యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కడప రీజియన్ హెడ్ రంజిత్‌కుమార్

చక్రాయపేట : ఖాతాదారుల శ్రేయస్సే ధ్యేయంగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప నిచేస్తుందని ఆ బ్యాంక్ కడప రీజియన్ హెడ్ రంజిత్‌కుమార్ తెలిపారు. మంగళవారం గంగారపువాండ్లపల్లెలో నాగలగుట్టపల్లె యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచి ఆధ్వర్యంలో ఖాతాదారులతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. తమ బ్యాంకు తరపున అందించే సేవలను వివరించారు. కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలైన ప్రధాన మంత్రి సూక్ష్మ బీమా యోజన, జీవన జ్యోతి బీమా యోజన, పశు బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, తదితరాలపై అవగాహణ కల్పించారు. ప్రతి ఒక్కరూ తమ బ్యాంక్ సేవలను సద్విని యోగం చేసుకోవాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న సైబర్ మోసాలపై కూడా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నాగలగుట్టపల్లె సీనియర్ బ్రాంచ్ మేనేజర్ సురేష్‌బాబు, మేనేజరు జిలానీబాషా సిబ్బంది పాల్గొ న్నారు.

**ఖాతాదారులకు ఎలాంటి సమస్యలు లేకుండా చేస్తాం**

వేంపల్లె : స్టేట్ బ్యాంకులో ఖాతాదారులకు ఎలాంటి సమస్యలు లేకుండా చేస్తామని ఆర్ఎం కిశోర్ తెలిపారు. వేంపల్లెలోని స్థానిక స్టేట్ బ్యాంకులో ఉన్న సమస్యలపై ఫోన్‌లో మంగళవారం ఆర్ఎంను విలేకరులు సంప్రదించగా మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. బంగారు రుణాలకు సంబంధించి రిజర్వ్ బ్యాంకు నిబంధనల ప్రకారం రెన్యూవల్ చేసుకునే సమయంలో రుణాన్ని పూర్తిగా చెల్లించాలని, అయితే ఈ ఖాతాదారులను దృష్టిలో పెట్టుకుని రెన్యూవల్ చేసుకునే సమయంలో వడ్డీని మాత్రమే చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఖాతాదారులు కూడా వడ్డీని చెల్లించి బంగారు రుణాలను రెన్యూవల్ చేసుకోవాలన్నారు. బ్యాంకు సిబ్బంది అలా చేయకపోతే తన దృష్టికి తీసుకుని రావాలన్నారు.

### వికలాంగుల నమోదుకు స్పందన

కమలాపురం : వికలాంగులు, వయో వృద్ధులు తమకు అవసరమైన పరికరాల నమోదుకు విశేష స్పందన లభించింది. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో కమలాపురం, వల్లూరు మండలాలకు చెందిన వయో వృద్ధులు, వికలాంగులకు అవసరమైన కృత్రిమ పరికరాల నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా రెండు మండలాలకు చెందిన దాదాపు 300 మంది వరకు వివిధ పరికరాల కోసం నమోదు చేసుకున్నారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ కెజియాకు దరఖాస్తులు అందజేశారు.

# తల్లిపాలు అమృతం లాంటివి

కమలాపురం : తల్లిపాలు బిడ్డకు అమృతం లాంటివని ఐసీడీఎస్ సూపర్ వైజర్ జయకుమారి తెలిపారు. మంగళవారం కమలాపురం సెక్టార్ పరిధిలోని కొలిమివీధి అంగన్‌వాడీ సెంటర్‌లో ఫస్ట్ సచివాలయం పరిధిలోని అంగన్‌డీలు నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అంతకు ముందు ర్యాలీ నిర్వహించారు. తల్లిపాలపై తల్లులకు అవగాహన కల్పించారు. తల్లిపాలతో బిడ్డలో రోగ నిరోధకశక్తి పెరుగుతుందన్నారు. బిడ్డ పుట్టిన గంటలోపే ముర్రుపాలు తాపించాలన్నారు. ఇలా పాలు తాపించడం వలన తల్లికి రొమ్ము, గర్భాశయ క్యాన్సర్, మధు మేహం తదితర రోగాలు రాకుండా ఉంటాయన్నారు. బిడ్డకు ఆరు మాసాలు వచ్చే వరకు తల్లిపాలే శ్రేష్టమన్నారు. తల్లిపాలు శిశువుకు ప్రకృతి ఇచ్చే సహజసిద్ధమైన టీకా అన్నారు. తల్లిపాల పట్ల ప్రతి తల్లి అవగాహన కలిగి ఉండాలన్నారు. తల్లులు తమ బిడ్డకు విధిగా పాలు ఇవ్వాలన్నారు. పండ్లు అధికంగా తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారన్నారు. అంగన్‌వాడీ వర్కర్లు లక్ష్మీదేవి, వైష్ణవి, గౌసియా, తల్లులు పాల్గొన్నారు.

**జమ్మలమడుగులో..**

జమ్మలమడుగు : పుట్టిన బిడ్డకు తల్లిపాలు తాగించడం వల్ల పిల్లల్లో వ్యాధినిరోదక శక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మల తెలిపారు. మంగళవారం ఎర్రగుంట్ల పట్టణంలోని వేంపల్లి రోడ్డులో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పుట్టిన ఆరు నెలల వరకు తల్లిపాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్యకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**చెన్నూరులో..**

వల్లూరు (చెన్నూరు) : లక్ష్మీనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నమాచుపల్లి సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గుర్రమ్మ, మహిళా పోలీస్ సునంద ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిపాలతో బిడ్డకు, తల్లికి శ్రీరామరక్ష అన్నారు. బాలింతలకు, గర్భిణులకు తల్లిపాల విశిష్టతను వివరించారు. బిడ్డకు తల్లిపాలు పట్టడం ద్వారా రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

**కొండాపురంలో..**

కొండాపురం : అంగన్‌వాడీ 5లో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని స్థానిక వైద్యురాలు సజాత నిర్వహించారు. బిడ్డకు ముర్రుపాలు పట్టడం వల్ల బిడ్డ ఆరోగ్యంగా ఉండటంతో పాటు వారిలో వ్యాధి నిరోధకశక్తి ఉంటుందని ఆమె సూచించారు. గర్భిణులు, బాలింతలు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.



కమలాపురంలో తల్లులకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ జయకుమారి



జమ్మలమడుగులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



చెన్నూరు : ర్యాలీలో పాల్గొన్న ఐసీడీఎస్ అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు



కొండాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

### ఘనంగా రామాలయ వార్షికోత్సవం

లింగాల : మండలంలోని ఎగువపల్లెలో వెలసిన శ్రీకోదండరామస్వామి ఆలయంలో మంగళవారం 5వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేద పండితులు రాంకుమార్ శర్మ ఆధ్వర్యంలో శ్రీసీతారామ, లక్ష్మణ, ఆంజనేయ స్వాముల ఉత్సవ విగ్రహాలకు అర్చనలు, అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీసీతారాముల కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. కోమన్నూతల, దిగువపల్లె, మురారిచింతల, లోపట్నూతల, తాతిరెడ్డిపల్లె, లింగాల తదితర గ్రామాల నుంచి వందలాది మంది భక్తులు తరలి వచ్చారు. పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. అనంతరం స్వామివారికి నారికేలాలు సమర్పించి తీర్థ ప్రసాదాలను అందుకున్నారు. నెల్లూరు చెక్కభజన వారి బృందంచే చెక్కభజన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు. చిన్నారుల చెక్కభజన కార్యక్రమం అందరిని ఆకట్టుకుంది. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.



శ్రీసీతారాముల కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

# స్మార్ట్ మీటర్ల నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి



కమలాపురంలో విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు



వేంపల్లెలో సంతకాల సేకరణలో వామపక్షాలు, ప్రజా సంఘాల నాయకులు



మైలవరంలో తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న చేనేత నాయకులు



ముద్దనూరులో తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న డీవైఎఫ్‌ఐ నాయకులు

కమలాపురం : స్మార్ట్ మీటర్ల బిగింపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సీపీఐ ఏరియా కార్యదర్శి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్ల బిగింపును నిరసిస్తూ మంగళవారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సబ్ ఇంజినీర్ సాగర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కరెంట్ చార్జీలు పెంచినా, స్మార్ట్ మీటర్లు బిగించినా బద్దలు కొట్టండి అని ప్రతిపక్షంలో ఉండి చంద్రబాబు చెప్పారని గుర్తు చేశారు. నేడు అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఇంటింటికి స్మార్ట్ మీటర్లు బిగిస్తూ ప్రజలకు ద్రోహం చేస్తున్నాడని మండి పడ్డారు. ఈ ఏడాది కాలంలో ప్రజల నుంచి రూ.15,526 కోట్లను సర్ చార్జీలు, ఇతర చార్జీల రూపంలో వసూలు చేశారన్నారు. అదానీతో షేకీ ద్వారా చేసుకున్న ఒప్పందం ద్వారా 25 ఏళ్లపాటు ప్రజలపై 1.10 లక్షల కోట్లు అదనపు భారం పడుతుందని, ఆ నిర్ణయాన్ని తక్షణం ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

**వేంపల్లెలో..**

వేంపల్లె : రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం విద్యుత్ ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగించి ప్రజలపై భారాలు మోపవద్దని పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి తులసిరెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక నాలుగు రోడ్ల కూడలిలోని బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద వామపక్షాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో విద్యుత్ స్మార్ట్ మీటర్లుకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. టీడీపీ కూటమి పాలనలో విద్యుత్ చార్జీలు విపరీతంగా పెరగడంతో బిల్లు ముట్టుకుంటే షాక్ కొట్టే విధంగా ఉందని ఎద్దేవా చేశారు. టీడీపీ కూటమి రాష్ట్రానికి రాహు కేతువులుగా దాపురించాయన్నారు. 2024 ఎన్నికల సమయంలో టీడీపీ కూటమి అధికారంలోకి వేస్తే విద్యుత్ చార్జీలు పెంచనే పెంచమని, ఇంకా తగ్గిస్తామని హామీ ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చాక చంద్రబాబు మాట తప్పాడన్నారు. కార్యక్రమంలో వామపక్ష, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

**మైలవరంలో..**

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : స్మార్ట్ మీటర్ల ఏర్పాటు నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శివనారాయణ తెలిపారు. మంగళవారం స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు వ్యతిరేకంగా తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యకం చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరణ చేసి దేశంలోని ప్రైవేట్ పారిశ్రామికవేత్తలైన అదానీ, అంబానీ సంస్థలకు అప్పగించడం దుర్మార్గం అన్నారు. ఒక యూనిట్ కరంట్ ఒక రూపా 50 పైసలు ఖర్చు ఆవుతుంటే యూజర్ చార్జీల పేరిట ఉమ్మడి రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం 1998లో 2.10 పైసలకు పెంచారన్నారు. నాటి తెలుగుదేశం ప్రభుత్వం విద్యుత్ సంస్కరణలు ప్రవేశపెట్టిందని ఆయన విమర్శించారు. ప్రజల్లో వ్యతిరేకత రాక ముందే ప్రభుత్వాలు వెంటనే స్మార్ట్ మీటర్ల ఏర్పాటును విరమించుకోవాలన్నారు. కార్యక్రమంలో చేనేత నాయకులు పాల్గొన్నారు.

**ముద్దనూరులో..**

ముద్దనూరు : విద్యుత్ చార్జీల పెంపు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును తక్షణమే ఉపసంహరించుకోవాలని లేకుంటే మరో బషీరాబాగ్ తరహా ఉద్యమం తప్పదని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివ కుమార్ హెచ్చరించారు. మంగళవారం ఆయన స్థానిక డిప్యూటీ తహసీల్దారు వరదకిషోర్‌రెడ్డికి విద్యుత్ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడు తెచ్చిన విద్యుత్ సంస్కణలు ప్రజలపై పెనుభారాలుగా మారుతున్నాయని, ప్రతిపక్షంలో వున్నప్పుడు అదానీ, సెకీలతో చేసుకున్న విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు అన్నీ రద్దుచేస్తానని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని కొనసాగిస్తున్నారన్నారు. స్మార్ట్ మీటర్ల వినియోగంతో రైతులకు, వినియోగదారులకు ఎన్నో ఇబ్బందులు వస్తాయన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ నాయకులు పాల్గొన్నారు.

# వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి



కమలాపురంలో తహసీల్దార్ శివరామిరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న మీడియా ప్రతినిధులు



పులివెందులలో ఆర్డీఓ కార్యాలయ ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు



వేంపల్లెలో ఆర్ఐ లోకేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు



ముద్దనూరులో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న పాత్రికేయులు

కమలాపురం : వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షుడు గెంటెం సురేష్‌బాబు, జిల్లా కార్యవర్గ సభ్యుడు కురుగాండ్ల చంద్ర డిమాండ్ చేశారు. మంగళవారం రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు కమలాపురంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు నిరసనలు వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ శివరామిరెడ్డికి వారు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. అక్రిడేషన్ కార్డులను జారీ చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, ఇప్పటికే పలు మార్లు గడువు పొడిగించారని, ఇక జాప్యం చేయకుండా తక్షణం కొత్త అక్రిడేషన్ కార్డులు జారీ చేయాలన్నారు. కార్డులు లేక పోవడంతో జర్నలిస్టులు ప్రభుత్వం నుంచి వస్తున్న సదుపాయాలను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే దీని వలన హెల్త్ కార్డులు కూడా పొందలేక పోయారన్నారు. అక్రిడేషన్ల కమిటీలో జర్నలిస్టుల యూనియన్స్‌కు ప్రాతినిధ్యం కల్పించాలని, వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీం మరింత ప్రయోజనకరంగా తీర్చిదిద్దాలని వారు డిమాండ్ చేశారు. అలాగే జర్నలిస్టులకు ప్రమాద బీమా పథకాన్ని పునరుద్ధరించాలన్నారు. జర్నలిస్టులకు ఇంటి స్థలాలు ఇస్తామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలుపుకోవాలని వారు కోరారు. విశ్రాంత పాత్రికేయులకు ఇతర రాష్ట్రాల్లో అమలు చేస్తున్న పాత్రికేయ పింఛను పథకాన్ని మన రాష్ట్రంలో కూడా అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు చుక్కా రవి కుమార్, మస్తాన్ యాదవ్, మహ్మద్ రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

**పులివెందులలో..**

పులివెందుల : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జర్నలిస్టులకు నూతన అక్రిడేషన్లను మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ ఆధ్వర్యంలో పులివెందుల ఆర్డీవో కార్యాలయంలోని ఏఓకు మంగళవారం జర్నలిస్టులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రభుత్వ వర్కింగ్ జర్నలిస్టులకు కొత్త అక్రిడేషన్లు ప్రభుత్వం వెంటనే జారీ చేయాలని, గత ప్రభుత్వం ఇచ్చిన అక్రిడేషన్లనే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రెన్యువల్ చేయడం తప్ప.. నూతన అక్రిడేషన్లు ఇవ్వడం లేదన్నారు. నూతన అక్రిడేషన్లు వచ్చిన తర్వాతనే వర్కింగ్ జర్నలిస్టులందరికీ హెల్త్ కార్డు పథకం పూర్తిస్థాయిలో వర్తింపవుతుందన్నారు. రాష్ట్రంలో అమల్లో ఉన్న వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ కార్డు పథకంలో కొన్ని లోటుపాట్లు ఉన్నాయన్నారు. వాటిని కూడా పూర్తిస్థాయిలో సవరించాలన్నారు. ఇతర రాష్ట్రంలో ఇస్తున్న గౌరవప్రదమైన జీతాన్ని మన రాష్ట్రంలోనూ అమలు చేయాలని కోరారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలన్నారు. రాష్ట్ర, జిల్లాస్థాయి అక్రిడేషన్ కమిటీలలో జర్నలిస్ట్ యూనియన్ ప్రాతినిధ్యం కల్పించాలని సీఎం చంద్రబాబునాయుడు జర్నలిస్టుల బీమా పథకాన్ని వెంటనే పునరుద్ధరించాలని కోరారు. దీనికి స్పందించిన ఆర్డీఓ కార్యాలయ ఏఓ ఈ విషయాన్ని ప్రభుత్వానికి తెలియజేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ నాయకులు, ఐజేయూ సభ్యుడు శ్రీనివాస్, ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు శ్రీనాథ్‌రెడ్డి, రమణారెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, ప్రభంజన్, మురళి, చాంద్ బాషా, శంకర్‌రెడ్డి, రాము, నరసింహులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

**వేంపల్లెలో..**

వేంపల్లె : వర్కింగ్ జర్నలిస్టులకు అక్రిడేషన్లు వెంటనే జారీ చేయాలని, పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఏపీయూడబ్ల్యూజే) వేంపల్లె మండల శాఖ అధ్యక్షుడు వరికూటి రఘునాథ్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆ యూనియన్ పిలుపు మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ లోకేష్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కొత్త అక్రిడేషన్లు జారీ చేయడంలో అనవసర జాప్యం చేస్తుందన్నారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు మహబూబ్‌బాషా, మధుసూదన్‌రెడ్డి, శివకేశవరెడ్డి, ఖదీర్, కేశవ ప్రతాప్‌రెడ్డి, సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**ముద్దనూరులో..**

ముద్దనూరు : మండల ప్రాత్రికేయులు డిప్యూటీ తహసీల్దారు వరదకిషోర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఇప్పటికే అనేకసార్లు పొడిగిస్తూ వచ్చిన అక్రిడేషన్‌లను ఇకముందు పొడిగించకుండా కొత్త కార్డులు మంజూరు చేయాలని, వర్కింగ్ జర్నలిస్టుల హెల్త్ స్కీంను మరింత ప్రయోజనకరంగా తీర్చిదిద్దాలని, వర్కింగ్ జర్నలిస్టుల ప్రమాద బీమా పథకాన్ని తక్షణం పునరుద్ధరించాలన్నారు. పాత్రికేయులు కృష్ణమోహన్, సుధాకర్, బాలకృష్ణ, నందకుమార్, శంతన్ తదితరులు పాల్గొన్నారు.

### తాగునీటికి ఇక్కట్లు

ముద్దనూరు : మండలకేంద్రమైన ముద్దనూరులో తాగునీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో ప్రజలు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. కొంతకాలం నుంచి ముద్దనూరుకు గండికోట రిజర్వాయర్ నుంచి సీపీడబ్ల్యూ పథకం ద్వారా తాగునీటిని అందిస్తున్నారు. అయితే తరచూ ఏదో ఒక కారణంతో తాగునీటి సరఫరాకు ఆటంకం కలుగుతోందని దీంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు వాపోతున్నారు. రెండు రోజుల నుంచి మెయిన్‌బజార్, జమ్మలమడుగు రహదారితో పాటు పలు ప్రాంతాల్లో తాగునీరు సరఫరాకాలేదు. తాడిపత్రి రహదారిలో సీపీడబ్ల్యూ పథకంకు చెందిన పైప్‌లైన్ పగిలిపోవడంతో తాగునీటి సరఫరా ఆగిపోయింది. ఈపైప్‌లైన్ మరమ్మతులు వేగంగా చేపట్టకపోవడంతో తాగునీటికి ఇక్కట్లు తప్పలేదు. అధికారులు స్పందించి సీపీడబ్ల్యూ పథకం మరమ్మతు పనులు సకాలంలో జరిగి మండల కేంద్రంలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

**డాక్యుమెంట్ పోయినది**

బద్వేలి లలిత w/o బద్వేలి వెంకటేశ్వర రెడ్డి డి.నెం : 10/300 సుందరాచార్యుల వీధి, ప్రొద్దుటూరు. కడప జిల్లా. చిన్నదండ్లూరు గ్రామ పొలం, యర్రగుంట్ల(మండలం), కడప జిల్లా. కు సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్స్ (డాక్యుమెంట్ నెం : 1825/2008) పోయినవి. దొరికిన వారు క్రింది నెంబర్ కు తెలుపగలరు.

CELL: 9966238350